# దేశమంతా ఇట్లాగే ఉందా?

అతడిని అందరికంటె ముందుగాచూసినవాడు వెంకట్రామయ్య. అప్పటికింకా బాగా తెల్లవారలేదు. అలవాటుచొప్పున వెంకట్రామయ్య స్నానం చెయ్యటానికి కాలువకు బయలుదేరాడు.

అది చలికి దేహము కరుడు కట్టుకునిపోయే కార్తికమాసము. ఎదటివస్తువు కనబడనంతదట్టంగా పొగవంటిమంచు అలుముకున్నది. వెంకట్రామయ్య ప్రతి రోజూ ఆదారినే కాలవకువెళ్ళుతూ ఉంటాడు. అతడి ఇంటినుంచికాలవకు ఒకటే తిన్ననిదారి కళ్ళుమూసుకుని నడవచ్చు.

ఐదుగంటలు కావచ్చింది తెల్లవారినట్టేలెక్క. మహాత్ముడి శిలావిగ్రహం ప్రతిష్ఠించిన చతుష్పథందగ్గరే ఈమధ్య ఏ బహిరంగసభ జరపవలసివచ్చినా నలుగురూ చేరుతున్నారు. ఆఊరి మొత్తంమీద నలుగురో ఐదుగురో ఉన్నారు రాజకీయాలనుగురించి అనర్గళంగా ప్రసంగించేవారు. అందరికీ వెంకట్రామయ్య అంటే ఎంతో అభిమానమూ విశ్వాసమూను. ఎందుకంటే అతడెక్కువగా మాట్లాడడు వింటాడు.

సాయంత్రం నాలుగుగంటలకు జరగబోయే సమావేశాన్నిగురించి ఏదో ఆలోచిస్తూ అడుగులువేస్తున్నాడు వెంకట్రామయ్య. అరవైయేళ్ళుదాటిన తల్లి ఇంట్లోఉంది. కోడలు పురిటికివెళ్ళింది. తల్లికి ఆసరాగా ఉండాలన్న కోరికతో ఒక చిన్నబిందె బుజానపెట్టుకుని బయలుదేరాడు. ఊరికి ఇంకా పంపులురాలేదు బావినీళ్ళు ఉప్పగా ఉంటాయి.

ఆ ఊరికి మంచినీళ్ళ కొరత చాలాఉంది. కరెంటుదీపాల వెలితి వెలితిగానే నిలిచిపోయింది. ఈరెండు వసతులూ ఆ గ్రామానికి కల్పించాలని గట్టిప్రయత్నం చేస్తున్నవాళ్ళల్లో వెంకట్రామయ్య ఒకడు.

అతడు చతుష్పథం దగ్గరికివస్తుండగా కాలికేదోతగిలి బోర్లాపడబోయి

ఆపుకున్నాడు. చేతిలోఉన్న బిందె కిందపడి దొర్లుకుంటూ అల్లంతదూరాన రాతికి కొట్టుకుని ఆగిపోయింది. వెంకట్రామయ్య చప్పున టార్చివెలిగించాడు ఆ వెలుతుర్లో కాలికి తగిలిన దానినిచూసి అనుకోకుండానే అడుగు వెనక్కు వేశాడు.

ఎవరో దురదృష్టవంతుడు-రక్తం కక్కుకుని ప్రాణాలు విడిచాడు. ముఖం చాలా వికృతంగాఉంది. బుజాలదగ్గర చినిగినచొక్కా, మాసి మట్టికొట్టుకుపోయిన నిక్కరు-బోర్లాపడిఉన్నాడు. అతడినేమయినా గుర్తించగలనేమోనని వెంకట్రామయ్య టార్చి వెలుగులో దేహమంతా తిప్పిచూశాడు. అతడిచేతికి నాలుగువేళ్ళు మాత్రమే కనబడ్డాయి. బొటనవేలు ఉండవలసినచోట కాయకాసిఉంది. మబ్బులా పెరిగిన క్రాపు ముఖమ్మీదపడి గుర్తుపట్టటానికి వీల్లేకుండా రక్తంతో అంటుకుపోయింది. బాగా వెలుతురువస్తే అదే తెలుస్తుందని అతడు బిందె చేతపట్టుకుని కాలవకు దారి తీశాడు.

స్నానంచేస్తున్నంతసేపూ అతడు చనిపోయిన వ్యక్తిని గురించే ఆలోచిస్తున్నాడు-కాని ఆలోచనలు ఒక తీరానికి చేరుకోలేదు.

తీరా బిందెనీళ్ళలో ముంచుతూఉండగా వెంకట్రామయ్యకు చప్పున స్ఫురించింది-ఒకవేళ అతడు నాలుగు సంవత్సరాలకింద కనబడకుండా పోయిన వెన్నెలగంటివారి మురళీధరుడేమోనని.

వెంకట్రామయ్య తిరిగి వచ్చేసరికి ఆశవంచుట్టూ పదిమందిచేరారు. శవాన్ని వెల్లికిలా తిప్పారు. ఎవరికి తోచినమాట వారంటున్నారు. కాని ఆ శవమెవరిదో తేల్చలేక పోయారు.

బిందె ఇంట్లోదింపి, వెంకట్రామయ్య అక్కడికి చేరుకునేసరికి పొద్దుపొడుస్తున్నది. అప్పటికి మరి కొంత మంది పోగైనారు అతను గుంపునుతోసుకుంటూ పోయి ముఖం పరీక్షగాచూసి చప్పున కుడిచెయ్యిచూశాడు. మళ్ళీ బొటనవేలు లేని దృశ్యం కంటబడ్డది వెంకట్రామయ్య తలవంచుకొని ఇంటికి వెళ్ళాడు.

ఆ శవము మురళీధరుడిదే. అయితే ఈ పరిస్థితి ఎలా సంభవించింది? ఈ ఆలోచన తీవ్రంగా అతడి మస్తిష్కంలో పనిచేయసాగింది ఇల్లు చేరుకుని వాకిట అరుగుమీద కూలబడ్డాడు పట్నవాసంలో చదువుకుని బుద్ధిమంతుడివలె

తిరిగి స్వగ్రామం చేరుకున్నవాళ్ళు ఆ గ్రామంలోలేరు. అసలు బి. ఏ. వరకూ చదివినవాళ్ళే లేరు-ఆడుళ్ళో ఈ మురళీధర్ తప్ప.

ఆ దారినపోతూ రైతు రంగయ్య "అదేమిటి అబ్బాయిగారూ? ముఖమట్లా పెట్టుకుని కూర్చున్నారు?" వింతగా అతడినేచూస్తు అడిగాడు.

వెంకట్రామయ్య తాను చూసినదీ ఊహించినదీ చెప్పాడు.

అంతా విన్నతరువాత రంగయ్య అన్నాడు-ఆ మధ్య మీరు లేనప్పుడు మురళీధర్ చదువుకున్నవాడు కనుక ఈ గ్రామంలో "ఇదిచేద్దాం అదిచేద్దాం" అని నలుగురిని కూడగట్టుకుని పథకాలువేయటం ప్రారంభించాడు. మురళీధర్ ఏది చెప్పినా పటేల్ చీదరించుకునేవాడు. అతడేది తలపెట్టినా విఘ్నం కలిగించేవాడు. అక్కడ బడిపెట్టాలని మురళీధర్ నానా తంటాలుపడ్డాడు. అది పటేల్‌కి ఇష్టం లేదు. తాలూకాధికారి ఆమోదంతో ఆ పని చెయ్యాలని మురళీధర్ ఊరికి వెళ్ళగా చూసి అతడిమీద పోలీసువారికి దురభిప్రాయం కలిగించాడు. వ్యతిరేక ప్రచారం చేయించాడు. మీ అమ్మగారిక్కూడా ఈ విషయంతెలుసు. పటేల్ చెప్పిన చాడీలతో పోలీసులువచ్చి మురళీధర్ ఎక్కడున్నాడని అతడి తండ్రిని నిర్బంధించటం అతడి ఆచూకీ తెలపమని బెదిరించటం, ఆయన చెప్పకపోతే కాల్చిచంపటం, జరిగింది. నిజానికి మురళీధర్ చేసినతప్పేమీ కనబడలేదు. సాయంత్రం కాగానే నలుగురినీ పోగుచేసి పత్రికచదివి వినిపించేవాడు. తనకు తెలిసినవిషయాలను అందరికీ తెలియచెప్పేవాడు. "చాకులాంటి కుర్రాడు కదండీ? ఊళ్ళో అందరి క్షేమమూ కనుక్కునేవాడు. అతడిపేరు అప్పటికప్పుడు వింటున్నాను."

తలపాగా సవరించుకుని, చుట్టవెలిగిస్తూ 'మనలోమనమాట వెంకట్రామయ్య గారూ. మన పటేలు తనపేరుతప్ప మరొకరిపేరును సహించలేడు. ఎవరి నోట విన్నా భరించలేడు. పాపం మురళీధర్ ఏంచేశాడని ? గుడిసెల వెంబడి తిరిగి వాళ్ళపరిసరాలను శుభ్రంగా ఉంచుకొమ్మని బోధించేవాడు. తోటివాళ్ళతో కలిసి మురికిపేటలన్ని బాగుచేసేవాడు. గుడిసెలలో ఉన్నపిల్లలను ఒకచోట కూర్చొబెట్టి చదువు చెప్పేవాడు. ఎవరినోటవిన్నా మురళీధర్‌ది ఎంత గొప్పమనసు ? ఎంత సంఘసేవ చేస్తున్నాడు అన్నమాటే. ఇదంతా చూసి సహించలేని పటేలు చేసిన దుర్మార్గము' అంటూ రంగయ్య పంచతో కళ్ళు తుడుచుకున్నాడు.

వెంకట్రామయ్య పెరట్లో ఉన్న తల్లికి ఆ శవం మురళీధర్‌దేమోనన్న సందేహంగా ఉందని చెప్పి ఆమెను కూడా చూడమన్నాడు.

ఆమె గుండెలు బాదుకుంటూ 'ఇలా జరుగుతుందని అనుకుంటనేఉన్నా. ఆకాస్తా అయిపోయిందా ? తల్లిపోయిన తరువాత నాదగ్గరే పెరిగాడు నాలుగేళ్ళు ఆ పటేలుకు అకారణంగా ఇంత కోపమేమిటి ? మురళీధరుడు మాయామర్మ మెరగని వాడు కదా ? వాడిమీద ఎందుకో పగపట్టాడు పటేలు ? ఇంతాచేస్తే ఆ నాలుగు కుటుంబాలకూ ఈ నలుసు ఒక్కడే ఎట్లాగో నాలుగు అక్షరమ్ముక్కలు వచ్చాయి. తల్లి లేకపోయినా తండ్రికోసమే వాడు ఇక్కడికివచ్చాడు' ముసలమ్మ అటు ఇటూ తొంగిచూసి, రహస్యంగా "మురళీధరుడి భార్య బావిలో పడటానికి ఈ పటేల్ కారణమని ఎవరికి తెలియదు ?" అన్నది కళ్ళు తుడుచుకుంటూ.

వెంకట్రామయ్యకు గొంతులో తడి ఆరిపోయింది. 'మురళీధరుడికి పటేలు పెత్తండ్రి వరస. తనకు పిల్లలులేరు కదా. అతడిమీద ఎందుకంత కక్ష ? రక్త స్పర్శలో ఆపేక్షలు ఉండవా ?' ఈ విధంగా వెంకట్రామయ్యకు ఎంత ఆలోచించినా విషయం అర్థంకావటం లేదు.

తువాల బుజమ్మీద వేసుకుని మళ్లీ ఆ గుంపులోకి వెళ్ళాడు. అప్పటికి పోలీసువారు వచ్చారు. జనసమ్మర్దం తగ్గింది. పటేలు పోలీసు వాళ్ళతో చాలా వినయంగా మాట్లాడాడు. తన విచారాన్ని వెళ్ళబోసి లోపలికి వెళ్ళిపోయాడు. ఒక గంట తరువాత పోలీసులు అందరినీ అతడిని గురించిన సంగతులడిగి రాసుకుని శవాన్ని అక్కడినుంచి తీసుకుపోవాలని ప్రయత్నాలు చేస్తుండగా వెంకట్రామయ్య పటేలు ఇంటికి వెళ్ళాడు అప్పటికి పదిగంటలు దాటినా పటేలు ఇంకా ముఖం కడిగినట్టులేదు. వెంకట్రామయ్యను చూసి వాకిటి పంచలోకి వచ్చి కూర్చున్నాడు చుట్ట వెలిగిస్తూ, ముందుగా అతడే పలకరించాడు "నీవు అక్కడ లేవు టయ్యా ?" అని.

వెంకట్రామయ్య లేనని తలఊపాడు.

'ఆశవాన్ని గుర్తుపట్టగలవా ?" అడిగాడు పటేలు చెంపలు సర్దుకుంటూ.

'లేదండీ' అన్నాడు వెంకట్రామయ్య. "వీడు జైలునుంచి తప్పించుకొని పారిపోతున్నాడట పోలీసులు వెంబడించారట. నిన్నటినుంచీ ఒకటే పరుగెత్తు

తున్నాడట. ఆ పరుగెత్తటంలో ఆ రాతిబొమ్మ తగిలి పడ్డట్టున్నాడు. ఆ కాస్త ప్రాణం పోయింది. ఆ ప్రాణం కోసమేగా వాడు పరుగెత్తిందీ పోలీసులు వెంబడించిందీను ?" అన్నాడు విచారంతో నిట్టూర్చి.

"నేను వస్తూండగా ఎవరో అనుకుంటున్నారండీ ఎంత నిజమో ఎంత అబద్ధమో తెలియదు. అది మురళీధరుడి శవమంటున్నారు' అన్నాడు పటేలు ముఖంలో చూస్తూ.

"చూడు వెంకట్రామయ్య, అందరివీ ఊహలు, మురళీధరుడు కనబడకుండాపోయి ఎన్నేళ్ళయిందంటావు ? తండ్రికోసం వచ్చినవాడు తనపొలం-తన పనీ వదిలిపెట్టి, ఊరును బాగుచేయబోయాడు. ఎక్కడో బెడిసికొట్టి ఉంటుంది. వాడెప్పుడో చెల్లిపోయే ఉంటాడు'

వెంకట్రామయ్య మళ్లీ శవందగ్గరికి వచ్చాడు. పోలీసులు ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టున్నారు.

అంతలో తలకు తువాలు చుట్టుకుని, ఒంటికి చొక్కా లేకుండా-కట్టుకున్న పంచె పైకిపట్టుకుని, బీడీ కాలుస్తూ ఒక యువకుడు వచ్చాడు. ఇద్దరు మనుషులను వెంటబెట్టుకుని, "వీళ్ళు ఇద్దరు దొంగలు ఒకడు పారిపోయాడు. వీడు మా ఊరి వాళ్ళ చేతికిచిక్కి బాగా దెబ్బలుతిని పరుగెత్తుతుండగా మా భూకామందుగా రబ్బాయి తుపాకీతో వెంబడించి కాల్చేశాడు. పరుగెత్తుతూవచ్చి ఇక్కడ ప్రాణం విడిచాడు" అన్నాడు.

"ఏం దొంగతనం చేశాడు ?"

"వడ్ల బస్తాలండి"

"ఎన్ని ?"

"మేం చూసేసరికి నాలుగు బస్తాలు చేరవేశాడండి ఐదోదాన్ని ఎత్తుతుంటే పట్టుకున్నామండి"

పోలీసులు కర్రను తిప్పుతూ అనాసక్తంగా వింటున్నారు.

అంతలో ఏడెనిమిదేళ్ళ పిల్లవాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. నాన్ననాన్న అంటూ శవాన్ని కుదుపుతున్నాడు-ఏడుస్తూ.

"నీవెవరు ?" పోలీసులు పిల్లవాడిని ఇవతలికి లాగారు.

"మానాన్నండి. నాకు వచ్చినప్పుడల్లా ఐదురూపాయల బిస్కెట్లు చాక్లెట్లు తెచ్చియిస్తాడండి. ఈసారి నాన్నవచ్చినప్పుడు నేను ఇంట్లోలేను, వచ్చి వెళ్ళిపోయాడని అమ్మ చెప్పింది. ఇప్పుడే వెళ్ళాడని నన్ను పరుగెత్తి కలుసుకోమంది. గంటనుంచి పరుగెత్తుకొస్తున్నానండి. నాన్న ఇంకాలేవడా ? పోలీసుగారూ చెప్పండి" ఏడుస్తున్నాడు పిల్లవాడు.

"అయితే మీనాన్న ఇంట్లో ఉండడా ? ఏం పనిచేస్తాడు."

"ఏమోనండి ఎప్పుడయినా వస్తాడండి. వచ్చినప్పుడు అమ్మకు డబ్బులిస్తాడు, నాకు తినడానికి ఏవయినా తెస్తాడు. కొన్నిడబ్బులిస్తాడు మానాన్న ఇంకలేవడాండి ?"

"చచ్చిపోయినాడురా ఇంకలేవడు. మీవాళ్ళను పిలుచుకురా."

''అబ్బ నేనింకపోలేనండి. పరుగెత్తి పరుగెత్తి కాళ్ళు లాగుతున్నాయండి" కళ్ళు తుడుచుకుంటున్నాడు పిల్లవాడు.

''ఆరి రామిగా ఇక్కడున్నావురా ? నిన్నెతకలేక నాకాళ్ళు పడిపోతున్నాయి. రా ఇంటికి పోదాం" పిల్లవాడి చెయ్యిపట్టుకు లాగాడు ఒకవృద్ధుడు.

"నీవెవరు ? ఈ పిల్లవాడు నీకేమవుతాడు ?" పోలీసు కర్రఆడిస్తూ అడిగాడు.

''వీడు నామేనల్లుడండి. తండ్రి చచ్చిపోయి నాలుగేళ్ళయింది. తండ్రి బ్రతికిఉన్నపుడు వీడుచెప్పినవన్నీ తెచ్చిఇచ్చేవాడు. తండ్రిపోయిన తరువాత నేను వాడుచూడకుండా తెచ్చి తల్లికిస్తూ ఉంటాను. ఎవరిని చూసినా మానాన్నేనంటాడు" పిల్లవాడిని తీసుకువెళ్ళిపోయాడు.

పోలీసులు కొంతసేపు వాళ్ళల్లోవాళ్ళు మాట్లాడుకున్నారు. రెండేళ్ళక్రిందటినుంచీ ఒక సంఘ విద్రోహికోసం వెతికివెతికి విఫలమవుతున్నారు. యస్.ఐ. ఎన్నోవార్నింగులిచ్చాడు సరిగా వెతకటంలేదని. పారిపోతుంటే కాల్చేశామని యస్ ఏ.కి ఈ శవాన్ని చూపిద్దామన్న ఆలోచన వచ్చిందివాళ్ళకు. వెంటనే రికార్డులో ఎక్కించుకున్నారు వివరాలన్నీ. శవాన్ని జీపులో వెనకనుంచి, బయలుదేరి వెళ్ళారు.

జీపు కదలగా చూసి స్నానంచేసి భోజనంచేశాడు, పటేలు. అతడికి తల మీదినుంచి కొండంత బరువు దిగినట్టుగా ఉంది.

మేనమామతో ఇంటికివెళ్ళిన రాము తల్లితో "అమ్మా నాన్న ఎప్పుడో చచ్చి పోయాడంటాడేమిటి మామ ? నాలుగురోజుల్నుంచీ నాకు ఎన్నివస్తువులు తెచ్చి ఇచ్చాడు ? మళ్ళీ వస్తానురా అని ఎత్తుకుని ముద్దుపెట్టుకోలేదూ ? నీతోకూడా చెప్పాడు కదమ్మా-ఈసారి చీరెలు తెస్తానని ? అక్కడ చచ్చిపడి ఉన్నవాడు నాన్నేనేమో ? నీవుకూడా రామ్మా చూద్దాం" తల్లిచెయ్యి పట్టుకులాగుతున్నాడు రాము.

లక్ష్మిమనసు అల్లకల్లోలమైంది. నిజంగా రాజారావు చాటుగా ఇంటికివచ్చి పిల్లవాడినీ లక్ష్మినీ అప్పుడప్పుడు చూడటానికి వస్తాడు నాలుగురోజులయినా ఉండ కుండా ఒకరాత్రి వేళలేచి వెళ్ళిపోతూఉంటాడు. ఆమె అన్నగారి దగ్గర తలదాచు కున్నది. ఇలా నాలుగేళ్ళనుంచీ రహస్య జీవితం గడుపుతున్నాడు, రాజారావు. అడిగితే చెప్తాడని బ్రతిమిలాడు కుంటుంది. ఏడుస్తుంది. అలిగి ఒకమూల కూర్చుంటుంది. కాని అప్పుడే నవ్వుముఖం పెడుతుంది. అతడు ఉన్న ఒకటి రెండు రోజులూ తను భీష్మించుకుని కూర్చుంటే జీవితంలో ఆకాస్త ఆనందాన్ని పోగొట్టుకున్న దవుతుంది. చేతచిక్కిన అవకాశాన్ని జారవిడుచుకున్న దవు తుంది.

ఆమె మనసులో ఆరాటం. ఒక్కసారి వెళ్ళి తనుకూడా ఆశవాన్ని చూస్తే? గుర్తుపట్టి గుండె పగిలేలా అక్కడే తను కుప్పగా కూలిపోతుందేమో ? పోలీసులు ఇంటికివచ్చి గొడవచేస్తారు. అన్నగారు ఇటువంటి వన్న సహించడు.

అతడెక్కడో రహస్య జీవితం గడుపుతున్నాడనుకోవటమే తనకు కొండంత ధైర్యము. దానితోనే రాముని అభివృద్ధిలోకి తీసుకురావాలన్న ఆశ.

కాని-మనసు నిలవనీయటంలేదు. అడుగు ముందుకు పడటంలేదు. కళ్ళు గట్టిగా మూసుకుని గుమ్మంలో కూలబడిపోయింది.

పిల్లవాడు తనతండ్రే నసుకోవటం-మేనమామ చెయ్యిపట్టుకుని లాక్కు పోవటం వెంకట్రామయ్య చూశాడు. వాళ్ళయింటికివెళ్ళి లక్ష్మిని అడిగాడు-"నీవు రాలేదేమమ్మా ఆ శవాన్ని చూడటానికి ?"

జవాబు చెప్పలేక-వచ్చేదుఃఖాన్ని అదిమి పెట్టుకోలేక గొల్లున ఏడ్చింది లక్ష్మి.

"మీ ఆయనకు ఒక చేతికి బొటనవేలు లేదా ?"

"నేనెరిగినప్పటినుంచీ లేదండి"

వెంకట్రామయ్య ఆలోచనలు మళ్ళీ మొదటికి వచ్చాయి.

నిజంగా అతడెవరై ఉంటాడు ? మురళీధరా ? వడ్లబస్తాల దొంగా ? లక్ష్మి భర్తా ?

ఇంతకు అది ప్రాణంలేని కట్టే అది ఎవరికి సంబంధించిన దయినా దాని భవిష్యత్తు ఒకటే. కక్షతీర్చుకున్నానని ఒకరనుకుంటే-దొంగకు తగినశాస్తి జరిగిందని మరొకరనుకుంటే-తన జీవితంలో దీపమారిపోయినట్టుగా ఇంకొకరు విలపిస్తుంటే-తమకొక పరిష్కారమార్గం దొరికిందని పోలీసులు ప్రమోషనుకోసం ఎదురుచూస్తున్నారు.

దేశమంతా ఇట్లాగే ఉందా ?